క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



ఫైజర్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకుల బృందం

అగనంపూడి: ఫైజర్ బహుళజాతి ఫార్మా కంపెనీలో జగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (ఈసీఈ విభాగం)కు చెందిన 9 మంది విద్యార్థులు ఉపాధి అవకాశాలు దక్కించుకున్నారు. ఫైజర్ సంస్థ అధికారులు మూడు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లో 9 మంది అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగం అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఆస్పత్రి ఆవరణలో యోగాభ్యాసం నేడు

అగనంపూడి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ యోగాభాస్యన కార్యక్రమం నిర్వహించనున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించడంతోపాటు ఉచిత యోగ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రజలు పాల్గొవాలని ఆమె కోరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాద్



బాధ్యతలు చేపట్టిన బీఎస్ఎస్ ప్రసాద్

పెదగంట్యాడ: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బీఎస్ఎస్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం సివిల్ సప్లై కార్యాలయంలో పనిచేసి పెదగంట్యాడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌భాస్కర్ విశాఖపట్నం వెస్ట్ ఎలక్షన్ విభాగానికి బదిలీ అయ్యారు.

జాబ్‌మేళాకు అనూహ్యస్పందన



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న కళాశాల కరస్పాండెంట్ రామారావు

గాజువాక: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. వివిధ పోస్టుల భర్తీకి 25 కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 800 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 215 మందిని ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేసినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను అభ్యర్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎం.రమేష్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎల్ విజేత పరవాడ జట్టు

- రన్నరప్ గాజువాక జట్టు

తాటిచెట్లపాలెం: జర్నలిస్ట్స్ ప్రీమియర్ లీగ్(జేపీఎల్) విజేతగా పరవాడ జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో 5 రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరిగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గాజువాక జట్టు 75 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పరవాడ జట్టు ఒక బాల్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించి, ట్రోఫీని సొంతం చేసుకుంది. గాజువాక జట్టు రన్నరప్‌గా నిలిచింది. మ్యాచ్‌ల ముగింపు కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, స్మాల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక శాఖ అధ్యక్షుడు కె.పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, హరనాథ్, నారాయణ గ్రూప్ గంటా రవి, శృతి టిఫిన్స్ రాజు, పవిత్ర రెడ్డి కన్‌స్ట్రక్షన్స్ శ్రీనివాస్‌రెడ్డి, టెక్ విజన్ రాజీవ్ సెంటా, ఈటోర్ నాగేశ్వరరావు, మై పైసా ఎర్రాజీ, పెప్సీ జోగేంద్రకుమార్, సుమంత్ అసోసియేట్స్ సుమంత్, గోల్డెన్ ఫ్యూచర్ డెవలపర్స్ శ్రీనివాస్, శ్రీ బాలాజీ డెవలపర్స్ గణేష్‌కుమార్, లక్కీ షాపింగ్‌మాల్ స్వామి, మ్యాక్ డాక్టర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు.. రక్తసిక్తం

పారిశ్రామిక ప్రాంతంలో వరుస రోడ్డు ప్రమాదాలు

- నెల రోజుల్లో పది మందికి పైగా మృత్యువాత
- పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- కానరాని నియంత్రణ చర్యలు
- రోడ్లపైకి రావాలంటే హడలిపోతున్న ప్రజలు

పారిశ్రామిక ప్రాంతంలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ప్రాణాలు హరిస్తున్నాయి. వరుస రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయినా నియంత్రణ చర్యలు కానరావడం లేదు. రహదారి భద్రత అంశాలపై అటు వాహనదారులు, ఇటు సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. గాజువాక ప్రాంతంలో ప్రతిరోజు ఏదోఒక చోట ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. జాతీయ రహదారితో పాటు ప్రధాన మార్గాల్లో అనేకమంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ఈ పరిణామాలతో రోడ్లపైకి రావాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.
- గాజువాక



పోర్టు రోడ్డులో తెలుగుతల్లి ఫ్లై ఓవర్ సమీపంలో ...(ఫైల్)

- రెండు రోజుల కింద పోర్టు రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ డాక్టర్లు మృత్యువాత పడ్డారు.
- ఆటోనగర్‌లోని తుంగ్లాం రైల్వే గేటు సమీపంలో ట్రాలర్ ఢీకొని అన్నా, చెల్లెలు దుర్మరణం పాలయ్యారు.
- చినగంట్యాడ జగ్గు జంక్షన్‌వద్ద జరిగిన ప్రమాదంలో హిందూజా ఉద్యోగి, ఆర్టీసీ స్టీల్‌సిటీ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్టీల్ ప్లాంట్ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. వందడుగుల రోడ్‌వద్ద జరిగిన ప్రమాదంలో ఒక ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్ మృత్యువాత పడ్డారు. అంతకుముందు కూడా స్థానిక జగ్గు జంక్షన్‌వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి, టోల్‌గేటు సిగ్నల్‌వద్ద ఒక యువకుడు, సుందరయ్య కాలనీవద్ద రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతి చెందారు. ఇలాంటి ప్రమాదాల్లో గాయాలపాలవుతున్నవారు లెక్కలేనంత మంది ఉన్నారు. తాజాగా, పోర్టు రోడ్‌లోని మారుతీ సర్కిల్‌వద్ద ట్రాలర్ ఢీకొనడంతో నవదంపతులు మృతి చెందగా, పంతులుగారి మేడవద్ద తాగి ఆటో నడపడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. అదే ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఈ పరిస్థితుల్లో రోడ్డెక్కాలంటే వాహనదారులు భీతిల్లుతున్నారు.



మృతి చెందిన నూతన దంపతులు(ఫైల్)



అన్నాచెల్లెళ్ల ఉసురు తీసిన కంటైనర్



ప్రమాద స్థలంలో...

కానరాని నియంత్రణ చర్యలు

గాజువాక ప్రాంతం పరిశ్రమలకు నిలయం కావడంతో ఇక్కడికి రాకపోకలు సాగించే భారీ వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రమాదాలు కూడా పెరిగిపోతున్నాయి. నిషేధిత సమయాల్లో భారీ వాహనాలు జనావాసాలమధ్య తిరుగుతున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదనే ఆరోపణలున్నాయి. రోడ్డు పక్కన అనధికారికంగా నిలుపుతున్న వాహనాల పట్ల స్పందించడంలేదు. రోడ్డుపక్కన నిలిపివున్న భారీ వాహనాన్ని తప్పించే క్రమంలో సైతం ప్రమాదాలకు గురవుతున్న దాఖలాలున్నాయి. ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయించాల్సిన ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలామంది విగతజీవులవుతున్నారు. ప్రమాదకరమైన కూడళ్లవద్ద కూడా పోలీసుల నిఘా తక్కువగా ఉండటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చాలా జంక్షన్లలో పోలీస్ సిబ్బంది నీడలో నిలబడి ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పట్టించుకోకపోవడం వంటి తప్పిదాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

తిరిగొచ్చేవరకూ ఆందోళనే

ఈ పరిస్థితుల్లో పనిమీద ఇంటినుంచి బయటకు వెళ్లినవారు తిరిగి వచ్చేవరకు ఆందోళన తప్పడంలేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరగడం, వాహన చోదకులు ఏమరుపాటుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. చిన్నపాటి తప్పిదాల వల్ల చాలా కుటుంబాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం, మద్యం సేవించి వాహనాలను నడపడం, పోటీపడి వేగంగా నడపడం, ఆటోలు, లారీలు, ట్రాలర్లు అధికలోడుతో వెళ్లడం కారణంగా ప్రమాదాలు పెరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలి

గాజువాక పారిశ్రామిక ప్రాంతం కావడంతో భారీ వాహనాలు అధిక సంఖ్యలో ఉంటున్నాయి. వాహనాల తాకిడికనుగుణంగా రోడ్ల విస్తరణ లేదు. దీంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కీలక జంక్షన్లలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడతున్నప్పటికీ ప్రమాదాలు జరగడం దురదృష్టకరం. నిబంధనలను అందరూ పాటించాలి. నిబంధనలను అతిక్రమిస్తున్నవారిపై మేము కఠిన చర్యలు తీసుకొంటున్నప్పటికీ కొంతమందిలో మార్పు రావడంలేదు. –కోటేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ సీఐ

వైఎస్సార్‌సీపీలో నియామకాలు



ఎంజీడబ్ల్యూ డేవిడ్‌రాజు, లీగల్ సెల్ అధ్యక్షుడు



వెంకటేష్, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆ పార్టీ అనుబంధ సంఘాలకు నూతన అధ్యక్షులను నియమించారు. పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎంజీడబ్ల్యూ డేవిడ్‌రాజు, బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా బోడి వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నష్ట పరిహారం చెల్లించాల్సిందే..

అగనంపూడి: ఉక్కు కర్మాగారంలో విధి నిర్వహణలో మరణించిన కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని లేబర్ కమిషనర్ ఆదేశించారని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామఅప్పారావు అన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అగనంపూడి నిర్వాసితకాలనీకి చెందిన సీతిన అచ్చుతరావు 2016లో ఉక్కులో జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. కారుణ్య నియామకం ఇస్తామని, వర్క్‌మెన్ కాంపన్సెషన్ చెల్లిచడం కుదరదని ఉక్కు యాజమాన్యం నిరాకరించింది. బీమా సంస్థ కూడా చెల్లించలేదు. దీంతో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్‌తో పాటు జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన లేబర్ కమిషనర్ రామారావు రూ.11లక్షల 73వేల పరిహారంతో పాటు 7శాతం వడ్డీతో కలిపిరూ.19 లక్షలు చెల్లించేలా ఆదేశాలిచ్చారని తెలిపారు. అచ్చుతరావు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం

మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని స్థానిక టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న ప్రతిపక్ష నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు పాలన ఉందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు 143 హామీలు ఇచ్చి.. వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా దగా చేశారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటాల ఫలితంగా చంద్రబాబు తూతూ మంత్రంగా ఒకటిరెండు పథకాలు అమలు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారన్నారు. 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు పింఛన్ అమలు మాటే లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను దగా చేస్తున్న క్రమంలో జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. ఈ పుస్తకం చంద్రబాబు పాలనను గుర్తుచేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతిపక్ష నేతలపై ఇష్టానుసారంగా కేసులు పెట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామాయ్య, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, నాయకులు పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీనివాసరావు, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, రోజా రాణి, కొయ్య భారతి, కల్పన, బోగాది సన్నీ, సిరట్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు ఘన సత్కారం



ప్రభావతి దంపతులను సత్కరిస్తున్న పద్మమార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘంలో కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా పనిచేసి మార్కండేయ లలిత సేవా సమితిని స్థాపించి సేవా కార్యక్రమాలు విస్తృతం చేసిన పచ్చారి ప్రభావతి సేవలు ఎనలేనివని సంఘ కార్యదర్శి బేతా హనుమంతురావు, గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు కొనియాడారు. అగనంపూడి శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభావతి, రామలక్ష్మణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీకి నిదర్శనంగా నిలిచే ప్రభావతి దంపతులు చేసిన సేవా కార్యక్రమాలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ప్రతినిధులు దొడ్డి దేముడు, గంధోళి వెంకటరమణ, గుదే సుశీలా గజేంద్రరావు, గుదే వరలక్ష్మి, గజేంద్రరావు, త్రిమూర్తులు, బేతా ప్రసాద్, గుదే రాజు, కనక మహాలక్ష్మి, గంధోలి వరలక్ష్మి, వాసుపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో ఆందోళన



మండుటెండలో ఆందోళన చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మిక సంఘాలు సోమవారం మండుటెండలోనే ఆందోళన తెలిపాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం షెడ్ కూలిపోయింది. అయితే ఆ షెడ్ తిరగి నిర్మించడానికి పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆందోళనకారులు చేసేది లేక మండుటెండలో గొడుగులు పట్టుకొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో అడ్డగోలుగా జరుగుతున్న నూతన నియామకాలు ఆపాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను అమ్మాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, భానుమూర్తి, సూరిబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు డిమాండ్ చేశారు. కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం ఆపాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా జగదాంబ జంక్షన్లో అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు కార్మికుల ఉపాధినే కాపాడలేకపోయారని విమర్శించారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌లో అదనంగా 6 వేల మంది కార్మికులు అవసరం ఉన్నా, పనిలో ఉన్న 4500 మంది కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని తప్పుబట్టారు. కార్మికులు తమ ఉపాధి రక్షణకు పోరాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరించి పోలీసులతో, బెదిరింపులతో ఉద్యమాన్ని అణిచివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖ వస్తున్న ప్రధాని మోదీతో స్టీల్ ప్లాంట్ రక్షణ, కార్మికుల ఉపాధిపై ప్రకటన చేయించాలని కోరారు. నిరసనలో ఏపీఎఫ్‌టీయూ నాయకుడు కె.దేవా, సిటూ నాయకులు పి.వెంకట్‌రెడ్డి, పి.మణి, ఎం.సుబ్బారావు, పి.వెంకట్రావు, వి.నరేంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే రెహ్మాన్, సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు డి.వెంకటరమణ, డీవైఎఫ్ఐ నాయకురాలు డి.ఉమాశైలజ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్‌లో స్లీపర్ కోచ్‌లు ప్రవేశపెట్టాలి

అగనంపూడి: విశాఖ నుంచి తిరుపతి మధ్య నడుస్తున్న ఏసీ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లో శాశ్వత ప్రాతిపదికన థర్డ్ ఏసీ, సెకెండ్ ఏసీ, త్రీఈ కోచ్‌లను ప్రవేశపెట్టాలని తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. రెండు ప్రధాన నగరాల్లో రాత్రి వేళ వారానికి మూడు సార్లు మాత్రమే నడుపుతున్న ఈ రైలును రెగ్యులర్ ట్రైన్‌గా మార్చడంతో పాటు స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కేవలం సిటింగ్‌తో నడుస్తున్న ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి డిమాండ్ ఉందని, అదే స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. సగటున రోజుకు 1220 మంది ప్రయాణం చేశారని ఆయన పేర్కొన్నారు. రైలును వెంటనే రెగ్యులర్ చేయడంతోపాటు సెకెండ్, థర్డ్ ఏసీ కోచ్‌లు జోడించాలని ఆయన కోరారు.

శ్రీశ్రీ స్ఫూర్తితో ఉద్యమాలు



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

ఉక్కునగరం: మహాకవి శ్రీశ్రీ స్ఫూర్తితో పోరాట పటిమ పెంచుకోవాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ పిలుపునిచ్చారు. శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ పోరాడితే మన హక్కులు మనం కాపాడుకోగలమన్నారు. ప్రజానాట్య మండలి స్టీల్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. కృష్ణార్జున మాట్లాడుతూ శ్రీశ్రీ గొప్ప కవి అని.. ఆయన రచనలు ద్వారా ప్రజలను మేలుకొల్పే వారన్నారు.శ్రీశ్రీ రచనలు స్ఫూర్తి నింపుతాయని కొనియాడారు. కార్యక్రమంలో కళాకారులు జి. సత్యనారాయణ, సత్యసాయి. కె. శ్రీనివాసరావు, నూకరాజు, గౌరిశంకర్, కోటేశ్వరరావు, సువర్ణరాజు, యు.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

దువ్వాడ వీఎస్ఈజెడ్ కమిషనర్ శ్రీనివాస్



రక్తదానంలో పాల్గొన్న ఉద్యోగులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న వీఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్

అగనంపూడి: రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలు నిలబెడుతుందని దువ్వాడ వీఎస్ఈజెడ్ కమిషనర్ ముప్పాళ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది ప్రాణాలను కాపాడే శక్తి రక్తదానానికి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ఉద్యోగులు, వీఎస్ఈజెడ్ ఉద్యోగులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు, వీఎస్ఈజెడ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో విజేతలుగా నిలవాలి



ఎంపికైన క్రీడాకారులతో క్రీడా విభాగం అధికారులు, కోచ్

ఉక్కునగరం: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచి స్టీల్‌ప్లాంట్ ఖ్యాతి పెంచాలని స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం అధికారులు ఆకాంక్షించారు. ఈ నెల 19 నుంచి 25 వరకు హర్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో స్టీల్‌ప్లాంట్స్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో అండర్–17 జాతీయ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి సాయి కౌశిక్, కిరణ్ సాయిలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉక్కు స్పోర్ట్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను విభాగం అధికారులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ పోటీల్లో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఘోష్, ఎ.కె. ఘడాయ్, ఎ.ఒ.వి. మురళీమోహన్, బాక్సింగ్ కోచ్, నేషనల్ రిఫరీ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

23న స్పాట్ పెయింటింగ్ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న సన్నిబాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీఏవీ పాఠశాలలో ఈనెల 23న స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు అర్చికా వ్యవస్థాపకుడు జి.ఆర్. శ్రీహరి, గ్రీన్ ట్రీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దొడ్డి సన్నిబాబు తెలిపారు. సోమవారం వారు వివరాలు వెల్లడించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకల్లో భాగంగా పెయింటింగ్ పోటీలతో పాటు చెట్లు నాటే కార్యక్రమం, ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసక్తి కలిగిన పాఠశాలలు తమ విద్యార్థుల పేర్లను ఈనెల 19లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కో పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులను మాత్రమే అనుమతిస్తామన్నారు. పూర్తి వివరాలకు 98853 11575, 94412 74416 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళా కార్మికురాలికి గాయాలు

గాజువాక: విశాఖ డెయిరీ కర్మాగారంలోని స్టెరిలైజ్ ఫ్లేవర్డ్ మిల్క్ (ఎస్ఎఫ్ఎం) విభాగంలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళా కార్మికురాలికి గాయాలయ్యాయి. కర్మాగార వర్గాలు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలేనికి చెందిన ఎల్.రాము (45) విశాఖ డెయిరీలో పని చేస్తోంది. ఎస్ఎఫ్ఎం విభాగంలో పని చేస్తుండగా బాదం మిల్క్ బాటిల్ పగిలింది. అందులోని వేడి బాదం పాలు ఆమె శరీరంపై పడడంతో సుమారు 30 శాతం గాయాలయ్యాయి. దీంతో ఆమెను డెయిరీ యాజమాన్యం షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.